వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

- నిబంధనలకనుగుణంగా అధికారులు వ్యవహరించాలి
- పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 17 : ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా జిల్లాలో ఎన్నికలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర శాసన సభ ఎన్నికలు-2023 నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణా తరగతులను దశల వారీగా నిర్వహించాలని కోరారు. స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. మూడు నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి పనిని తక్షణమే పూర్తి చేసి రోజువారీ నివేదిక తనకు సమర్పించాలని శివలింగయ్య ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల సహాయాధికారి సుహాసిని, పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ రిటర్నింగ్ అధికారులు రోహిత్ సింగ్, మురళీకృష్ణ, రామ్మూర్తి, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి అనిల్ కుమార్, సీపీవో ఇస్మాయిల్, డీఆర్డీవో మొగులప్ప, డీపీవో రంగాచారి, మాస్టర్ ట్రెయినర్స్ రామరాజు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన గ్రేటర్ కమిషనర్

వరంగల్, అక్టోబర్ 17 : సిటీ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అంబర్ కిశోర్ ఝూను గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని ఆయన కలిసి పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

అంబర్ కిశోర్ ఝూకు మొక్క అందజేస్తున్న షేక్ రిజ్వాన్ బాషా

బతుకమ్మ, దసరా పండుగ ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 17 : బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని వరంగల్-1 డిపో మేనేజర్ వీ వెంకటేశం తెలిపారు. డిపో నుంచి ప్రత్యేక బస్సులను హైదరాబాద్ -హనుమకొండ రూట్‌లో అదనంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే, పండుగను పురస్కరించుకొని ప్రయాణికులకు బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు, 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్ల వెనుక వారి పేరు, మొబైల్ నెంబర్ రాసి బస్టాండ్‌లో ఉన్న లక్కీడిప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. 31న వరంగల్ రీజియన్ హెడ్ క్వార్టర్స్‌లో డ్రా తీసి ఐదు మంది మహిళలు, ఐదు మంది పురుషులకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశం కోరారు.

రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ బాలబాలికల జట్టు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 17 : సంగారెడ్డిలోని సదాశివపేటలో ఈ నెల 19 వరకు జరిగే కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అండర్-19 బాలబాలికల జట్ల వివరాలను ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బారుపాటి గోపి ప్రకటించారు. బాలుర జట్టులో బీ విక్రం. బీ వంశీకృష్ణ. యూ సాయికిరణ్, ఎన్ వినయ్ బాబు, బీ అజయ్, జీ ప్రవీణ్, ఎం హరీశ్, జయప్రభాస్, కే అభిలాష్, ఎస్ సంతోష్, కృష్ణ, జే సిద్ధార్థ, బాలికల జట్టులో ఎస్ అక్షర, బీ యామిని, సీహెచ్ రేణుక, శైలజ, కే పూజ, యూ సంజన, ఎం సరిత, వీ శ్రావణిశ్రీ, టీ సునీత, పీ వైష్ణవి, ఎల్ మహేశ్వరి, కే అక్షయ ఉన్నారు. కోచ్‌లుగా రవీందర్, రాజు, మేనేజర్‌గా దివ్య వ్యవహరించనున్నారు.

కార్యకర్తల మరణాలు బాధిస్తున్నాయి..

- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, అక్టోబర్ 17 : తనకు రాజకీయంగా ఆయువు పట్టుగా ఉంటున్న రాయపర్తి మండలంలో ఇటీవలి కాలంలో పలు కారణాలతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మృత్యువాత పడుతున్నారని, వారి మరణ వార్తలు తన హృదయాన్ని తీవ్రంగా కలచివేస్తున్నాయని రాష్ట్ర పం చాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, వార్డు మాజీ సభ్యుడు కోల రామ్మూర్తిగౌడ్ తీవ్ర అనారోగ్య సమస్యతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి ఎర్రబెల్లి మృతుడి నివాసానికి చేరుకుని రామ్మూర్తి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాడె మోశారు. మృతుడి తండ్రి, కుమారుడు, కుటుంబ సభ్యులను ఓదార్చే క్రమంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో రా యపర్తి మండలానికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్తగా, క్రమశిక్షణ కలిగిన రామ్మూర్తి అకాల మరణం కుటుంబంతోపాటు గ్రామానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వెంట స్థానిక సర్పంచ్ నలమాస సారయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు గూబ అశోక్‌కుమార్, పయ్యావుల కొమురుమల్లు, దీకొండ సంపత్, బొమ్మెర అశోక్‌కుమార్ ఉన్నారు.

రామ్మూర్తి పాడె మోస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వినయన్నను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్

కాజీపేట, అక్టోబర్ 17 : ప్రజలు ఆపద సమయంలో అన్నా అంటే నేనున్నా.. అనే పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ అన్నారు. కాజీపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు పసునూరి మనోహర్ తయారు చేయించిన వాల్ పోస్టర్లను విజయ్‌భాస్కర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ వినయన్న అన్ని వర్గాలకు రాజకీయ పక్షపాతం లేకుండా సమన్యాయం కల్పించారన్నారు. వినయ్‌భాస్కర్ మళ్లీ గెలిస్తే నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అర్హులకు అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రచారంలో గడపగడపకూ తెలుపాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే దాస్యం వినయ్‌భాస్కర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, డివిజన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జి దువ్వ కనకరాజు, బోడ దశరథ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు వినయ్, సోని, జీవన్, రమేశ్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాస్యం విజయ్‌భాస్కర్ తదితరులు

కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం భద్రకాళీ అమ్మవారు గాయత్రీ మాతా అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామున అర్చకులు నిత్యహ్నికం నిర్వహించిన అనంతరం అమ్మవారిని గాయత్రీ మాతాగా అలంకరించారు. ఉదయం చద్రఘంటా క్రమంలో సింహ వాహనసేవ నిర్వహించారు. సాయంత్రం మహిషాసురమర్ధిని దుర్గా క్రమంలో గజ వాహన సేవపై ఊరేగించారు. గాయత్రీమాతా అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో శేషుభారతి పర్యవేక్షిస్తున్నారు. నగరంలోని పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వరంగల్ : గాయత్రి మాతా అలంకరణలో దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు

వరంగల్ : రోహిణి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవీ

హనుమకొండ : చంద్రఘంటా అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

రోహిణి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవీ

నగరంలోని ఎంజీఎం సెంటర్ ఉన్న రాజరాజేశ్వరీ ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా రోహిణి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవీ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

చంద్రఘంటా అలంకరణలో పద్మాక్షి

హనుమకొండ : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు జరుగుతున్నాయి. మూడో రోజు పద్మాక్షి అమ్మవారు చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి, అలంకరించినట్లు అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ, ఆస్థాన వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు.

వేయిస్తంభాల గుడిలో జింక వాహనంపై పల్లకిసేవ

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను మూడో రోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, గాయత్రిదేవిగా అలంకరించారు. మారేడుదళ బిల్వార్చన అనంతరం జింక వాహనంపై పల్లకిసేవ నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. యాగశాలలో ఆధ్యాత్మికవేత్త అనిల్‌కుమార్, రమేశ్ ఉభయదాతలుగా చండీహోమం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఝాన్సీ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈవో కే వెంకటయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో రుద్రేశ్వరసేవాసమితి సభ్యులు కోన శ్రీఖర్, గండ్రాతి రాజు, పులి రజనీకాంత్, పల్లం రమేశ్, కిషన్ లాల్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బంధువులు, పారిశ్రామికవేత్త పొద్దుటూరి రామేశ్వర్‌రెడ్డి బంధువులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడిలో పల్లకిసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు